సీసీ రోడ్ల కోసం రూ.80 లక్షల నిధులు

జగద్గిరిగుట్ట: గాజులరామారం సర్కిల్‌లో పలు కాలనీలలో సుమారు రూ.80 లక్షలతో అంతర్గత సీసీ రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి. సర్కిల్ పరిధిలోని మహదేవ్‌పురం, రాయల్‌హిల్స్ కాలనీలో రూ.30 లక్షలతో, సూరారం, రాజీవ్‌గాంధీ నగర్‌లో రూ.30 లక్షలతో, శారద నగర్‌లో రూ.20 లక్షల నిధులతో పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్: బస్తీలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేష్ అన్నారు. గాజులరామారం డివిజన్ బాలయ్య నగర్‌లో గురువారం నెగ్సస్, మెడివిజన్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 215 మందికి బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

ఉడాయించిన బంగారు నగల వ్యాపారి

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- రూ.10 కోట్ల విలువ చేసే బంగారంతో పరార్



నితీష్ జైన్

కేపీహెచ్‌బీ/నిజాంపేట్: బాచుపల్లి ప్రగతినగర్‌లో బంగారం వ్యాపారం నిర్వహిస్తూ నమ్మించి డబ్బులు వసూలు చేసి ఉడాయించిన మోసగాడి బాగోతం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. గురువారం ఇద్దరు వ్యాపారులు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాధరాణి అనే మహిళ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. అశోక్ కుమార్ జైన్ అనే వ్యక్తి 30 ఏళ్లుగా కేపీహెచ్‌బీ కాలనీలో రిషబ్ జువెల్లరీ పేరుతో బంగారు నగల వ్యాపారం చేస్తున్నాడు. ప్రగతినగర్‌లో చేతన్ జువెల్లరీ పేరుతో వ్యాపారం చేస్తున్న నితీష్ జైన్ నాలుగేళ్లుగా అశోక్ కుమార్ జైన్ వద్ద బంగారం తీసుకుని వ్యాపారం చేసేవాడు. గత నెల 8న, ఈ నెల 10న నితీష్ జైన్ అతని భార్య స్వీటీ జైన్‌లు అశోక్ కుమార్ నగల షాపుకు వచ్చి రెండుమార్లు సుమారు అరకేజీ బంగారు నగలును తీసుకున్నారు. డబ్బులు త్వరలో చెల్లిస్తామని నమ్మబలికి వెళ్లిపోయారు. ఎప్పుడు డబ్బులు అడిగినా త్వరలోనే ఇస్తామని నమ్మబలికేవారు. ఇదే కోవలో ఐడీపీఎల్ కాలనీలోని దీపక్ జైన్‌కు చెందిన జ్యోతి జువెల్లరీలోనూ సుమారు 860 గ్రాముల బంగారు ఆభరణాలను తీసుకొని నెలరోజుల్లో డబ్బులు చెల్లిస్తామని నమ్మబలికారు. అయితే ఈ నెల 10 నుంచి ప్రగతినగర్‌లోని నితీష్ జైన్‌కు చెందిన చేతన్ జువెల్లరీ దుకాణాన్ని తెరవకపోవడంతో అతనికి బంగారం ఇచ్చిన వ్యాపారులు, బంగారం కుదువ పెట్టిన వారు, వివిధ స్కీంల పేరుతో డబ్బులు కట్టినవారు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ, ఐడీపీఎల్ కాలనీలకు చెందిన ఇద్దరు వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విషవాయువులతో.. ఉక్కిరిబిక్కిరి



బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉంటుందని ప్రజలు ఈ ప్రాంతంలో ఇల్లు కొనుక్కొని నివసిస్తున్నారు. కానీ బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల నుంచి ప్రతి నిత్యం వెలువడుతున్న విష వాయువులతో కంటిమీద కునుకులేకుండా స్థానిక ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. విష వాయువులను వెదజల్లే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు వివిధ రూపాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సైతం కౌన్సిల్‌లో ఈ సమస్యను లేవనేత్తి ప్రభుత్వం దృష్టికి సైతం తీసుకెళ్లారు.

- వివిధ రూపాల్లో స్థానికుల నిరసన
- పట్టించుకోని అధికారులు
- అనారోగ్యంతో బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల ప్రజలు

నిజాంపేట్: బాచుపల్లి, మల్లంపేట్ ప్రాంతాలను అనుకుని ఉన్న బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల్లో ఉన్న పలు పరిశ్రమల నుంచి విష వాయువులు వాతావరణంలో కలుస్తున్నాయి. పరిశ్రమల నుంచి విష వాయువులు వెలువడుతుండటంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ విష వాయువులను వదులుతుండటంతో ప్రజలు వివిధ రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చిన్న పిల్లలు ఈ సమస్యతో తీవ్రంగా సతమతమవుతున్నారు.

పెద్ద ఎత్తున పోరాటాలు

పరిశ్రమల నుంచి వెలువడుతున్న విష వాయువులను అరికట్టాలని కార్పొరేటర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు వేలాది మంది పలుమార్లు నిరసన చేపట్టారు. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్య తీవ్రతను వివరించారు. పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. కోర్టును సైతం ఆశ్రయించారు. బాచుపల్లి, మల్లంపేట్, భౌరంపేట్, నిజాంపేట్, మియాపూర్ తదితర ప్రాంతాల్లో అనేక విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ హాస్టల్స్ ఉన్నాయి. వీటిల్లో వేలాది మంది విద్యార్థులు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే విష వాయువులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల తనిఖీలేవి?

పారిశ్రామికవాడలో తనిఖీలు చేయాల్సిన అధికారులు యాజమాన్యాలు ఇచ్చే మూముళ్ల మత్తులో పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుల సమయంలో నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారని పలువురు పేర్కొన్నారు. అనంతరం రెండు, మూడు రోజుల తరువాత ఈ సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్న చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు.



విషవాయువులను అరికట్టాలని నిరసన తెలుపుతున్న స్థానికులు(ఫైల్)

అధికారులు మొద్దు నిద్ర వీడాలి



ప్రజలు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటుంటే పీసీబీ అధికారులు మాత్రం మొద్దు నిద్ర పోతున్నారు. ప్రజల ప్రాణాలంటే అధికారులకు ఇంత చులకనగా కనిపిస్తున్నాయా?. వేలాది మంది విద్యావంతులు, ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి సమస్య తీవ్రతపై నిరసన చేపట్టినా పీసీబీ అధికారుల్లో చలనం లేకపోవడం బాధాకరం. అధికారులు తమ తీరు మార్చుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

– విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్.

ఇక్కడ బతకలేకపోతున్నాం



పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషవాయువులతో ఇక్కడ బ్రతకలేకపోతున్నాం. స్వచ్ఛమైన గాలి కూడా పీల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. విషవాయువులతో సాయంత్రం, తెల్లావారుజామున బయటకు వెళ్లలేక పోతున్నాం. అధికారులు చర్యలు తీసుకోకుండా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు.

– రాజేశ్, మల్లంపేట్

27న హనుమాన్ ఆలయంలో 'మన గుడి' కార్యక్రమం

చింతల్: వైశాఖమాసం పురస్కరించుకొని హిందూ ధర్మ ప్రచార పరిషత్ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 31 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 'మన గుడి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ధర్మచార్య హిందూ ధర్మ ప్రచార పరిషత్ టీటీడీ అధికార ప్రతినిధి పసుపులేటి నరేంద్ర కృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మన గుడి కార్యక్రమంలో భాగంగా 27న సూరారం డివిజన్ సంజయ్ గాంధీనగర్‌లోని పంచముఖ హనుమాన్ దేవాలయంలో నిర్వహించే కార్యక్రమాలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి

కుత్బుల్లాపూర్: ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో చేపట్టనున్న తిరంగా యాత్ర సన్నాహక సమావేశాన్ని గురువారం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి అధ్యక్షతన కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకుడు చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఈ నెల 17న జరిగే ర్యాలీలో పార్టీలకు అతీతంగా పాల్గొనాలన్నారు. సాయంత్రం 5 గంటలకు ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శులు మాధవి, మూగ జయశ్రీ, జిల్లా ప్రధాన కార్యదర్శులు గిరి వర్ధన్‌రెడ్డి, విఘ్నేష్‌చారి, కార్యదర్శి భరత సింహారెడ్డి, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సతీష్ సాగర్, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సరితారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్

దుండిగల్: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంతో పాటు సమగ్ర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని జయశంకర్ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్ అన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా గురువారం దుండిగల్ మున్సిపాలిటీ నాగులూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో మెలకువలు, పాడి పంట, చీడ పీడలను తట్టుకునే రకాల గురించి వివరించారు. అదే విధంగా రైతులు పంటలు వేసే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మట్టి నమూనాల పరీక్షల ఆవశ్యకత, వరిలో ప్రధాన ఎరువుల వినియోగం, డ్రమ్ సీడర్ పద్ధతితో వ్యవసాయ సాగు, సేంద్రియ ఎరువుల వాడకం తదితర అంశాలపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.యాదగిరి, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సి.వి సమీర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.శైలజ, రైతులు భరత్‌కుమార్, సుధాకర్, దేవేందర్, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎం.గోవర్ధన్

కాలనీల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: కాలనీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో రోడ్డు అధ్వానంగా మారడంతో స్థానికులు ఆయనను కలిసి విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి రూ.22 లక్షలను మంజూరు చేయించారు. సదరు రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పెరిక శివ, మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ షఫీ, సమీర్ ఖాన్, అజీమ్, ఇమ్రాన్, ఆసిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలి

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని, భవన నిర్మాణ కార్మికుల భీమా కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టీపీసీసీ లేబర్ సెల్ జిల్లా అధ్యక్షుడు కందాడి సుదర్శన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్‌ను గురువారం నగరంలోని కార్మిక శాఖ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాల్లోని భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం కార్మిక భీమాలో ఉన్న బీఓసీడబ్ల్యూ వెల్ఫేర్ అసోసియేషన్ కార్డు పథకంలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. 43 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.20.47 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం అని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

ప్రమాదకరంగా బైక్ విన్యాసాలు!





సుభాష్‌నగర్: గాజులరామారం నుంచి లాల్‌సాబ్ గూడాకు వెళ్లే రోడ్డులోని ప్రాణవాయువు పార్కు వద్ద నిత్యం కొంతమంది మైనర్లు ప్రమాదకర స్థాయిలో బైక్ విన్యాసాలు చేస్తున్నారు. బైక్‌ను కేవలం ఒక చక్రం పైనే నడపడం, నేలకు తాకిస్తూ వృత్తంలో చక్కర్లు కొట్టడం, వేగంగా నడుపుతూ కింద స్టాండ్‌ను రోడ్డుకు ఆనించి నిప్పులు చెలరేగేలా చేయడం వంటివి చేస్తున్నారు. ఇలా ప్రతిరోజు ప్రమాదకర స్థాయిలో విన్యాసాలు చేస్తూ చాలా సార్లు గాయాల పాలైన ఘటనలు కూడా ఉన్నాయి. గురువారం ఇలా విన్యాసాలు చేస్తుండగా సాక్షి కెమెరాకు చిక్కింది. ఇందులో బైక్ విన్యాసాలు చేస్తున్న వారందరూ 15 సంవత్సరాల లోపు వారే. వీరికి ఇద్దరు దగ్గర ఉండి ఎలా బైక్ రేసింగ్ చేయాలో నేర్పడం గమనార్హం.

కల్యాణం.. కమనీయం



కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల కార్యాలయాల సమీపంలోని రేణుకా ఎల్లమ్మ తల్లి ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఎల్లమ్మ కల్యాణంలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది, అధికారులు

పూడికతీసి.. తరలించడం మరిచి!

- ఎక్కడి వ్యర్థాలు అక్కడే..
- తరలించకున్నా బిల్లులు మంజూరు!
- అధికారుల పర్యవేక్షణ లోపం
- దుర్గంధంతో కంపు కొడుతున్న పరిసరాలు

రంగారెడ్డినగర్: భూగర్భ డ్రైనేజీ లైన్ల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా ఏర్పాటు చేసిన సిల్ట్ వాహనాలు కనిపించడం లేదు. దళితబంధు పథకం పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్లకు చెందిన 8 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల విలువ చేసే సిల్టు వాహనాలను అందజేశారు. వాటిని జలమండలికి అద్దె ప్రాతిపదికన సదరు లబ్ధిదారులు నడుపుతున్నారు. జెట్టింగ్ వాహనాలు డ్రైనేజీ పైపులైన్ల నుంచి తొలగించే సిల్టును తరలించాల్సి ఉంది. అయితే సిల్టు వాహనాలు రెండు, మూడు రోజులైనా డ్రైనేజీ వ్యర్థాలను తరలించకపోవడంతో తొలగించిన వ్యర్థాలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో సమీప ఇళ్ల వాసులు దుర్గంధాన్ని భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా సిల్టు వాహనదారులకు లక్షల్లో బిల్లులు చెల్లిస్తున్నా వాటిపై అధికారులు పర్యవేక్షణ కొరవడంతో జలమండలి ఆదాయానికి గండి పడుతోంది. సిల్టు వాహనదారుల నుంచి కమీషన్లను తీసుకుని అధికారులు కేవలం కార్యాలయానికే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



గురుమూర్తినగర్‌లో రోడ్డుపై కుప్పలుగా ఉన్న డ్రైనేజీ వ్యర్థాలు

ఒక్కో వాహనానికి రూ.1.2 లక్షలు వెచ్చిస్తూ..

జలమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిల్టు వాహనాలకు అద్దె రూపంలో ప్రతినెలా లక్షల్లో చెల్లిస్తున్నారు. ఒక్కో వాహనానికి అద్దె కింద రూ.23,150, డ్రైవర్ జీతం రూ.27,090, ఇద్దరు కార్మికులకు రూ.43,680, డీజిల్ ఖర్చుకు రూ.21,840 (రోజుకు 8 లీటర్లు), లూబ్రికెంట్లకు రూ.1,000, భీమా మొత్తం రూ.2,500, ఇతర అలవెన్సులు రూ.740 ఇస్తున్నారు. ఇలా మొత్తం 8 వాహనాలకు ప్రతినెలా రూ.9.6 లక్షలు చెల్లిస్తున్నారు.

సిల్టు తరలించకుండానే బిల్లులు..

ప్రతి వాహనం తమకు కేటాయించిన డివిజన్ పరిధిలో ప్రతిరోజు నిర్ణీత మొత్తంలో సిల్టును తరలించాల్సి ఉంటుంది. అయితే సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వాహనదారులు సిల్టును తలించకుండానే బిల్లులు తీసుకుంటున్నట్లు సమాచారం. సదరు వాహనదారుల నుంచి అధికారుల నెలవారీ కమీషన్లు తీసుకోవడం వల్లే సిల్టు తరలింపు విషయాన్ని పట్టించుకోవడం లేదన్న పలు కాలనీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. మొత్తం ఎనిమిది వాహనాలు ఉండగా.. కేవలం నాలుగైదు వాహనాలే తిరుగుతూ సిల్టును తరలిస్తున్నారు.



కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయ ఆవరణలో సిల్టు తరలించే వాహనాలు

ప్రేమించిన అమ్మాయి దక్కలేదని..



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్ కుమార్

- ఆమె భర్తను హత్య చేసిన యువకుడు
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు



పవన్

కేపీహెచ్‌బీకాలనీ: ప్రేమించిన అమ్మాయి దక్కలేదనే కోపంతో ఆ అమ్మాయి భర్తను హత్యచేసిన ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారంఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ శ్రీనివాసరావు, సిఐ రాజశేఖర్ రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. కాకినాడకు చెందిన వంపేన అయ్యప్పస్వామి అలియాస్ పవన్ (27) చిన్నప్పుడే తల్లిచనిపోవంతో మేనత్త ఇంటి వద్ద పెరిగాడు. ఈ సమయంలో శ్రావణి సంధ్య అనే అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాని పెళ్లి చేసుకుంటానని వాళ్ల తల్లిదండ్రులకు బంధువులతో అడిగించాడు. అతడి ప్రవర్తన నచ్చక వివాహం చేసేందుకు అమ్మాయి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. కొన్ని రోజుల తర్వాత ఆ అమ్మాయిని రాజమండ్రి దగ్గరలోని కోరుకొండ మండలం, ములగాడు గ్రామానికి చెందిన కాళ్ల వెంకటరమణకు ఇచ్చి వివాహం చేశారు. అనంతరం వారు బతుకు తెరువు కోసం భగత్‌సింగ్ నగర్‌ఫేస్-1లో నివాసముంటున్నారు. ఇటీవల తన సోదరీతో కలిసి శ్రావణి సంధ్య రాజమండ్రికి వివాహ కార్యక్రమానికి వెళ్లగా అక్కడ పవన్ ఆ అమ్మాయిని చూశాడు. ఎలాగైనా ఆమెను దక్కించుకోవాలంటే ఆమె భర్తను చంపాలని పవన్ పథకం వేసి ఆ అమ్మాయి నివాసముండే సమీపంలో మకాం మార్చాడు. తరచూ ఆ ఇంటి పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ ఇబ్బంది పెట్టేవాడు. ఈ క్రమంలో ఈ నెల10న అర్ధరాత్రి వెంకటరమణ తన తోడల్లుడు దుర్గాప్రసాద్‌తో ఇంట్లో బంధువులతో కలిసి ఉండగా పవన్ వచ్చి గొడవ పడ్డాడు. వెంకటరమణను హత్య చేసేందుకు పవన్ తన స్నేహితులైన గుబ్బల శివరామకృష్ణ (20), రాజమహేంద్రవరం అనిల్ (19), నంబిగారి సాయికుమార్(20), మరో బాలుడిని కలిసి వచ్చి వెంకటరమణ గుండెల్లో కత్తితో పొడవగా అక్కడికక్కడే వెంకట రమణ మృతి చెందాడు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు గుబ్బల శివరామకృష్ణ, రాజమహేంద్రవరం అనిల్, నంబిగారి సాయికుమార్‌ను అరెస్టు చేయగా బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. ప్రధాన నిందితుడు అయ్యప్పస్వామి అలియాస్ పవన్‌ పరారీలో ఉండగా గురువారం రిమాండ్‌కు తరలించామన్నారు.

CAUTION NOTICE

The general public is hereby informed that my client, **KOLAN HANMANTH REDDY,** is the absolute and lawful Pattedar and rightful owner of the land bearing **Survey No. 59/C, situated at Bachupally Village, Medchal-Malkajgiri District, Telangana - 500090.**

It has come to my client's attention that **M/s. SSK BUILDERS & PAVAN SAI CONSTRUCTIONS,** without any legal right, title, or authority, have illegally encroached upon the above-mentioned property and are attempting to sell and alienate portions of the land, and are also engaged in unauthorized construction activity.

Furthermore, a civil suit bearing **O.S. No. 34 of 2024** is currently pending before the **Hon'ble Additional District Judge Court at Medchal,** with respect to the ownership, title, and possession of the subject property.

Importantly, the Office of the Municipal Corporation - Nizampet, Medchal-Malkajgiri District, has officially confirmed via Prajavani (public grievance platform) that the above-named builders have not obtained any valid building permissions or approvals from the concerned authorities for construction in the said Survey No. 59/C. Therefore, the construction activity being carried out by them is entirely unauthorized and illegal.

Any person, institution, or entity that enters into any transaction, sale agreement, booking, or investment in the said land or project promoted by M/s. SSK BUILDERS & PAVAN SAI CONSTRUCTIONS, or any of their associates, does so entirely at their own risk. All such transactions shall be treated as illegal, void ab initio, and not enforceable in law.

My client reserves the right to initiate strict civil and criminal proceedings against any person found to be involved in illegal occupation, construction, or transfer of rights in the said land.

This caution notice is issued in the public interest to warn and protect innocent purchasers and investors from being misled or defrauded by the illegal acts of the said builders.

M/s. BURMA CHAKRAPANI LAW FIRM
Office: G-1, Sai Datta Apartments, Central Park, Kompally (Vill), Quthbullapur (M), R.R.Dist.
Cell: 9848068958, 9392010589
Email: chakrapaniburma@gmail.com